# తారుమారైన బాధ్యత

(కథానిక)

బి. సత్యనారాయణ

'ఈ సంసారాన్ని నేనిక చెయ్యలేను' అని నిక్కచ్చిగా అంటున్న సరోజ మాటలు వినిపించుకోనట్లుగానే కుటుంబరావు వ్రాసుకోవడం ప్రారంభించాడు.

'ఏమిటి చెప్పరేం!' అంటూ అతని చేతిలో ప్లాంకుమీదవున్న ఫైలును దూరంగా వేసేసరికి అతడు కోపంతో తలెత్తి చూచాడు. ఉద్రేకంలో అతని ముఖమంతా యెఱ్ఱబడింది.

'నీవు మనిషివా, పశువ్వా' అన్నాడు రోషంతో.

ఆమేమీ నొచ్చుకున్నట్లు కన్పించలేదు. 'నా విషయాన్ని తేల్చండి. నేనిక వుండలేను. ఈ దరిద్రాన్ని భరించలేను.'

'ఏం యిప్పుడు నీకేమొచ్చింది. కొండలు మోస్తున్నావా, కోనేటినీళ్ళు తెస్తున్నావా!'

'మీరేమైనా అనండి. నేనూ మీలాగే యే చిన్న వుద్యోగమో చేసి డబ్బు గడిస్తేనే తప్ప యీ దరిద్రాన్ని దాటే మార్గంలేదు. దానికి మీరొప్పుకొని తీరాలి' చాలా పట్టుదలతోనూ నిష్కర్షగాను అంటున్న ఆమెమాటలు అతన్ని రెచ్చగొట్టాయి.

'నేను దాని కంగీకరించనని మొదటినుంచీ చెప్తున్నాను. నీవనవసరంగా యిలాంటి పేచీలు పెట్టి, మన యిద్దరిమధ్య మనస్పర్ధలు తెచ్చి, నిండుసంసారంలో తుపాను చెలరేగేటట్లు, చేయడంతప్ప, లాభంలేదు. నా ప్రాణముండగా, నా యిల్లాలు బయటపడి వుద్యోగం చేయడం నేను సహించను.'

ఆమె వెంటనే అందుకుంది 'అయితే నాకే లోటూ లేకుండా జరపండి. అమ్మా పెట్టనూ పెట్టదు. అడుక్కు తిననూ నివ్వదన్నట్లుంది మీ రనేది.'

'ఏం నీకేం లోటు చేస్తున్నాను. తిండికి తక్కువా, గుడ్డకు తక్కువా.'

'అంతే. కడుపుకు తిండీ, కట్టుకోడానికి రెండు గుడ్డలూ వుంటే చాలు మన జీవితాలకు. ఎదురింటి సుబ్బారావుగారిని చూడండి. ఆ దాంపత్యాన్ని చూస్తే నాకడుపు నిండుతుంది.'

'అదే నీకూ నాకూ వున్న తేడా. మనకన్న గొప్పవారితో పోల్చుకొని బాధపడకపోతే, అసలు లేనివాండ్లతో పోల్చుకుని ఆనంద పడరాదూ.'

'మీరు కడుతున్నారు చాలుగా. అది సరే గాని ముందీవిషయం తేల్చండి.'

'ఏమిటా తేల్చే విషయం' అన్నాడు తీక్షణంగా.

'నా వుద్యోగం...'

'నీ వుద్యోగం! ఏదో తెలివైనదానివి కష్టసుఖాలలో పంచుకుంటా వనుకున్నాను గాని, యిలా మడతపేచీలతో నా నరాలనాద్యంతం నమిలేస్తా వనుకోలేదు. అసలు చదువుకున్న దానిని పెండ్లి చేసుకోవడమే నాదొక పెద్ద తప్పు. చివరిమాటలు అతనికి తెలియకుండానే నోరు జారడంవల్ల పెదిమలు కొరుక్కున్నాడు.

'అవును మొగవాండ్లెలా అన్నా చెల్లుతుంది. ఇంతకూ నాదే బుద్ధితక్కువ' అంటూ వుక్రోషంతో గిరుక్కున వెనక్కుతిరిగి చరచరా గదిలోకి వెళ్ళి ధడాలున తలుపు వేసికొంది.

కుటుంబరావు ఒక పెద్ద ప్రైవేటు కంపెనీలో టైపిస్టు. సరోజ, అతను యింటర్మీడియేట్ క్లాసువరకూ తోటివిద్యార్థులు. చిన్నప్పటినుంచి వీరిద్దరి మధ్యవున్న స్నేహం భార్యాభర్తలను చేసింది. సరోజతో కాపరంచేసిన కొన్నిదినాలకే యితనికి సంసారంలోని సారం నీరసిస్తున్నట్లు గోచరించింది. ఆమెకు కష్టాలను కలిగించకుండా వుండడానికి చాలా ప్రయత్నంచేశాడు. ఆమెను సుఖపెట్టాలని, తన ఖర్చులను పూర్తిగా తగ్గించుకొని తృప్తి పరచాలనుకున్నా లాభం లేకపోయింది.

క్రమంగా అతనికి ఆమె విషయమే పెద్ద సమస్యగా పరిణమించింది.

కుర్చీలో అలాగే కూర్చుని ఆలోచించాడు. అంతవరకు నలుగురిచే వ్రేలుపెట్టి చూపించుకోనబడని అతని జీవితం మైలపడబోతున్నట్లు తోచింది. కాని తన సరోజా నలా బాధపెట్టడం అతని కిష్టంలేదు. కనీసం ఆమె సుఖం కోసమైనా, ఆమె కోరుతున్నట్లు వుద్యోగంలో ప్రవేశపెట్టడమే వుత్తమమనుకున్నాడు. వారి దాంపత్యజీవితంలోని అశాంతిని రూపుమాపడానికి అంతకన్నా మార్గాంతరమేమీ అతనికి కన్పించలేదు.

ఏదో ఆలోచన తట్టినట్టు ఛటాలున కుర్చీనుంచిలేచి ఆమె గదివైపు వెళ్లాడు. లోపలినుంచి యేడుస్తున్న ధ్వని వినిపించింది. అతనిమీద అతనికే అసహ్యం కలిగింది. మెల్లిగా తలుపు తెరిచాడు. మంచంమీద బోర్లపడుకొని వెక్కి వెక్కి యేడుస్తున్న సరోజను చూడడంతోటే అతనిగుండె నీరైపోయింది.

'సరోజా, యిలా చూడు యెందుకలా యేడవడం. యిలా చూడు' అన్నాడు మంచంమీద కూర్చుని చేతితో ఆమెను తనవైపుకు లాగుతూ.

ఏడుపు మరీ పెద్దదైంది. మంచంమీద బల్లిలా కరుచుకపోయిన ఆమెను తనవైపుకు త్రిప్పుకోవడానికి అతనికంత సులభంగా సాధ్యంగాలేదు. నడుంచుట్టూ రెండుచేతులనూ పెనవేసి బలవంతంగా తన వైపుకు త్రిప్పుకోగల్గాడు. ఆమె పచ్చని ముఖమంతా కంది కుంకుమల్లే యెర్రనైంది. కండ్లుజ్యోతుల్లాగా యెర్రబడ్డాయి.

ఆమెను బుజ్జగిస్తూ, 'పిచ్చిదానా నిన్ను నేనేమన్నాను చెప్పు. వుద్యోగం చేద్దువుగానిగా, యిద్దరికొచ్చే జీతంతో చాలా హాయిగా వుండొచ్చు. మా కంపెనీకి ఒక టైపిస్టు అవసరమని నిన్న మా మేనేజ రెవరితోనో అనడం విన్నాను యిప్పుడే అప్లికేషన్ పెట్టు' అంటూ ఆమెను దగ్గరిగా లాక్కొని కౌగిలించుకున్నాడు తరువాత ఆమెయేడ్పు మానడాని కెంతో కాలం పట్టలేదు.

మూడుదినాలానంతరం మూడుగంటల సమయంలో, ఆఫీసునుంచి కుటుంబరావు కాళ్ళీడ్చుకుంటూ యింటి దారిపట్టి నడుస్తున్నాడు. అతని ముఖమంతా పాలి వైవర్ణమైంది. భారంగా శరీరాన్ని మోసుకుంటూ యింట్లోని మంచంలో నిర్వీర్యుడల్లే కూలబడ్డాడు. లోపల యేదో సర్దుకుంటున్న సరోజ అలికిడి విని తొంగిచూచి నవ్వుకుంటూ పరుగున వచ్చింది.

'ఇదిగోండి ఆర్డరు. మీ కంపెనీలోనే నన్నో టైపిస్టుగా అపాయింటు చేశారు. యిప్పుడే వచ్చింది.' అంటూ కవరును అతనిమీద పడేసింది.

కుటుంబరావు కవరు విప్పిచూచి దీర్ఘంగా నిట్టూర్చాడు. అతని మౌనాన్ని ఆమె వెంటనే గ్రహించింది.

'ఎందుకలా వున్నారు. నా కపాయింటుమెంటు వచ్చిందనే గదూ!'.

'కాదు' స్పష్టంగా సమాధాన మిచ్చాడు.

'మరెందుకు చెప్పండి' అంది మంచంమీద కూర్చుంటూ.

'ఏమీలేదు నా వుద్యోగం కాస్తా వూడింది' అన్నాడు దగ్గుత్తికతో.

'ఆ! అయితే నాకేలా యిచ్చారు' అంది ఆదుర్దాతో.

'నన్ను సస్పెండు చేసి, ఆ స్థానంలో నిన్ను అపాయింటు చేశారని యీ ఆర్డరువల్ల నాకిప్పుడు తెలుస్తూంది' అన్నారు నీరసంగా.

ఎందుకో సరోజ తల నిలువునా కొట్టివేసినట్లయింది. 'సారీ. నేను మానుకుంటాను. తిరిగి మీరే చేరండి' అంది దీనంగా.

'లాభం లేదు. నీవు మానుకున్నా, ఆఖాళీలో తిరిగి నన్నే నియమిస్తారనే నమ్మకం నాకు లేదు. రేపు నీవు వెంటనే జాయినవడం కన్నా మార్గాంతరం లేదు. ఇప్పుడు పశ్చాత్తాపపడీ గూడా ప్రయోజనంలేదు.' అతని కిక మాట పెగలలేదు. అవమానంతో కాబోలు తన యిల్లాలి పమిటె చెరగులో తలమార్చుకున్నాడు.